# లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్



పత్రికలో ప్రకటన వచ్చింది.

- 'వరుడు కావలెను-

విద్యావంతురాలై ఉన్నతాదాయం కలిగిన ఇరవై అయిదేళ్ళ యువతికి విద్యాధికుడైన వరుడు కావలెను. విడోయర్ అయినా ఫర్వాలేదు. కులంతో పనిలేదు'

వివాహ వేదిక పేజీలో బాక్స్‌కట్టి మరీ వేసారు. వెయ్యరూ, వాళ్లడిగినంతా చెల్లిస్తే! రెండోసారి చదవబోయాను. వరుడు అన్న పదం చదవగానే పట్టరాని నవ్వొచ్చింది. వరుడు- వధువు...

అవునూ, పెళ్లి ప్రకటనల్లో కావలెను- రావలెను అని రాస్తారెందుకో అసహజత కొట్టొచ్చేలా?

ఇరవై అయిదేళ్లకే విడోయరెందుకే వెర్రిమొహమా! ముప్పై అయిదేళ్లొచ్చినా పెళ్లికాని బ్రహ్మచారులన్పించుకొనే పురుషపుంగవులెందరు లేరు?

**కె. వరలక్ష్మి**

బెంగాలీ రచయిత శరత్‌బాబు తన నవలల్లో చాలాచోట్ల పాతికేళ్లకే వృద్ధాప్యం వచ్చేసినట్లేనని రాస్తాడు. అది చదివి ఒకటే నవ్వొస్తుంది నాకు.

గుట్ట మీది ఖిల్లా వెనక సూర్యుడు అస్తమించబోతున్నాడు. ఆకాశంలో దూది పింజెల్లాంటి మేఘాలు అక్కడక్కడ అతుక్కుపోయినట్లు నిల్చి ఉన్నాయి. గద్దల గుంపొకటి ఒక్కసారిగా హుషారుగా పైకి లేచింది. నేనున్న డాబా మీదుగా గిరికీలు కొడుతూ వెళ్లివెళ్లి గుట్టమీది చెట్లలో మాయమైంది.

ఇదేం చోద్యమో! ఇక్కడ ఊరి మీద గద్దలాడుతుంటాయి. మావైపు, గోదావరి పరీవాహక ప్రాంతంలో రామచిలకలు, గువ్వపిట్టలు, గోరువంకలు, కమ్మగా పాడే కోయిలమ్మలు, పేరు తెలీని ఎన్నెన్ని పక్షులో వచ్చి పలకరించి వెళ్తాయి.

ఆకాశ దేశాన- హాయిగా ఎగిరేటి- కూని రాగం తీస్తూ ఆప్యాయంగా మబ్బుల్ని పలకరించబోయాను.

హైదరాబాద్ నుంచి ఎగిరొచ్చిన పైలట్ ట్రైనీ విమానాలు మబ్బుల మధ్య దోబూచులాడుతూ కన్పించాయి. వాటి తాలూకు సన్నని ధ్వని నా చెవుల్లోంచి గుండెల్లో ప్రతిధ్వనించింది.

కాలేజ్‌కి దగ్గర్లో ఉందీ ఇల్లు. పాప మాత్రం స్కూలుకి బస్సులో వెళ్తుంది. డాబాపైన నా కోసమే కట్టినట్టు ఒకే ఒక గది. నేనొచ్చాక చిన్న కిచెన్, బాత్ కమ్ టాయ్‌లెట్ కట్టించారు ఇంటివాళ్లు. కిందంతా మార్కెట్ యార్డ్. కుడిపక్క యార్డంతా మాంసం దుకాణాలు. ఎడమ పక్క కాయగూరలు, ఆకుకూరలు. ఈ రెంటినీ కలిపే ఆ చివర ఫిష్ మార్కెట్. కింద, ఇంటివాళ్ల మిల్క్ సెంటరుంది.

తాడు కట్టిన బకెట్‌లో డబ్బులేసి దించితే కింద మార్కెట్‌లోని ఏ వస్తువైనా పైకొస్తుంది. ఆ ఏర్పాటు ఇల్లు గలవాళ్లే చేసారు.

కాలు కింద పెట్టకుండా గడవటం అంటే ఇదేనేమో!

ఊళ్లో తిరిగి అమ్మడానికి కాబోలు నెత్తి మీద బుట్టలో చేపలు పేర్చుకుని వెళ్తోంది ఒక ఆడమనిషి. పైనుంచి చూస్తుంటే చెయ్యితిరగని చిత్రకారుడు గీసిన చిత్రాల్లా జీవంలేకుండా ఒకదాని పక్కనొకటి, ఒకదాని తలపైన మరోదాని తోక, మరోదాని తోకపైన ఇంకోదాని తల-

చేపలు... చేపలు... మళ్లీ గోదారి స్మృతులు-

జీవం వున్న చేపలు ఎగిరెగిరి పడే అద్భుత దృశ్యాన్ని గోదారి మీద లాంచిలో ప్రయాణిస్తూ చూడాలి. సెప్టెంబర్ నెలలో వరదొచ్చి తగ్గిన గోదారి నిండు గర్భిణి లాగా... ఉప్పుటేరుల్లోంచి నదీ గర్భంలోకి ఎదురీది ఈది రూపాన్ని మార్చుకుని ఇలసలు పులసలై బొబ్బర్లంక గట్ల మీద, నాటు పడవల్లో, వలల చిక్కుముడుల్లో కుప్పలు తెప్పలై కన్పించే పులసల్ని ప్రసవించే నిండు గోదారి...

ఆ గోదారిని ప్రేమించే కదూ అతన్ని ప్రేమించేననుకుంది!

గోదారి ఒడ్డున రాజమహేంద్రవరం, గొప్ప వ్యాపారకేంద్రం. నాకేం తెలుసు అతను ప్రేమను, పెళ్లిని కూడా వ్యాపారంగానే తీసుకున్నాడని. నేను మాత్రం ఆ మత్తులోంచి బైటపడేసరికి ఏడాది దాటింది. ఈ లోపల నాలో మరో ప్రాణి జీవం పోసుకుని నన్ను అమ్మను చేసింది. అతనెప్పుడూ బిజినెస్ బిజినెస్ అంటూ బిజీ. చేపల్ని చవగ్గా కొని ఎక్స్‌పోర్టు చేస్తాడు. బాగానే సంపాదించాడు.

డబ్బు పెరిగేకొద్దీ అతనికి దాహం మరింత పెరిగింది. రెక్కలు ముక్కలు చేసుకుని పగలనక రాత్రనక నీళ్లలో ఈదులాడి ఆ పూర్‌ఫెలోస్ పట్టిన చేపల్ని మరింత చవగ్గా కొని మరింత ఎక్కువ ధరకి ఎక్కడెక్కడికో ఇంకాఇంకా దూరాలకి పంపించే క్రమంలో అతను నెమ్మదిగా నానుంచి దూరం కాసాగేడు.

బాగా లాభం వచ్చినప్పుడు ఇంట్లోకి ఓ కొత్త నగ, ధగధగ మెరిసిపోతూ... నీ కోసం ఎంత ఖరీదైంది తెస్తే అంత ఎక్కువ స్థాయిలోనూ ఆనందాన్ని ప్రకటించవేం అని ప్రశ్నించే అతని చూపులు. ఆ నగల్ని, చీరల్ని ఎంజాయ్ చెయ్యడానికి ప్రయత్నించేదాన్ని. డబ్బులో సౌఖ్యాన్ని వెతుక్కోడానికి ప్రయత్నించేదాన్ని. ఆ ఇన్‌ఫాచ్యుయేషన్ నుంచి బైటపడేసరికి పాపకి మూడేళ్లు.

వంటవార్పులకి, పాపాయిని చూసుకోడానికి మనుషులొచ్చారు. అతనొచ్చేసరికి అలంకరించుకోవడం, పెళ్లిళ్లకీ ఫంక్షన్లకీ అటెండవటం, అతని అభిరుచులు, ఫ్రెండ్స్, డ్రింక్స్- ఆ జనాలే వేరు.

సహజంగానే ఆలయంలో ఉత్సవ విగ్రహంలాంటి జీవితం- విసుగెత్తిపోయింది. లక్ష్మీవారపు పేటలోని రాజభవనంలాంటి ఆ ఇల్లు నా పాలిట జైలులా తయారైంది.

ఆ ఇంటికి ఎదురుగా ఒక నూనెగానుగ ఉండేది. మెషీన్స్ వచ్చింతర్వాత కూడా ఎద్దుకళ్లకి గంతలు కట్టి స్థిమితంగా బరువుగా తిరిగే ఆ గానుగనెందుకు యజమాని నడుపుతున్నాడో నాకర్థమయ్యేది కాదు. కానీ, గంతలు కట్టుకున్న ఆ ఎద్దుకీ నాకూ తేడా కన్పించేది కాదు.

టీవీ ఛానల్స్ చూసిచూసి విసుగెత్తిపోయింది. క్రమంగా సంగీతం, సాహిత్యం నాకు గొప్ప నేస్తాలయ్యాయి. పుస్తక పఠనం నాకు గొప్ప రిలీఫ్‌నిచ్చింది.

అవతలి వీధి మలుపు తిరిగితే గౌతమీ. రోజూ రెండు పుస్తకాలు తెచ్చుకోవడం, ఒకోరోజు రాత్రంతా నిద్రపోకుండా చదివేదాన్ని. అవీఇవీ అని కాకుండా గ్రంథాలయంలో దొరికిన పుస్తకాన్నల్లా చదివేను. ఎక్కడైనా సంగీత సభో, సాహిత్య సభో జరిగితే చాలు- అటెండైపోయేదాన్ని.

ఉన్నట్టుండి ఆ రోజు గోదారి గట్టున నడిచి రావాలన్పించింది. కొవ్వూరు ఆలయాల వెనక నుంచి పశ్చిమాన అదృశ్యమయ్యే అరుణబింబాన్ని చూసి ఎన్నేళ్లైంది!

ఆ సాయంసంధ్యా సమయాన కాలినడకన గోదారి గట్టువేపు బయలుదేరాను. దారిలో కళాకేంద్రం ఆవరణలో గొప్ప సందడి. హోర్డింగ్స్ మీద ఓ ప్రసిద్ధ రచయిత ఫోటోలు, సన్మాన కార్యక్రమం వివరాలు- సభ ఇంకా ప్రారంభం కానట్టుంది. కారిడార్లో జనం. జట్లుజట్లుగా నిలబడి ఎవరి కబుర్లలో వాళ్లున్నారు.

అక్కడున్న మొహాల్లో మూడొంతులు నేను ఇది వరకూ చూసినవే. అవును, వీళ్లంతా కవులు, రచయితలు, విమర్శకులు. మేగజైన్స్‌లోనో, వాళ్ల పుస్తకాల అట్టల వెనకో చూసిన మొహాల్ని గుర్తు తెచ్చుకుని పోల్చుకుంటున్నాను. అదంతా గొప్ప థ్రిల్లింగుగా ఉంది.

ఆ స్తంభం పక్కన భుజాన సంచీతో, పొడవుగా, ఉంగరాల జుట్టుతో- అవును, అతని పేరు గుర్తుకొచ్చింది. అతను రాసే ట్రెండు, శైలి నాకు చాలా నచ్చుతాయి. అతని కథలన్నీ ఇంచుమించు విషాదాంతాలే. అతను మాత్రం రాసే కథలకి ఏమాత్రం పొంతనలేకుండా, మెరిసే పల్వారస కన్పించేలా అందంగా ఆగాగి నవ్వుతున్నాడు.

'నీ మొహంలే, ఏడుపు కథలు రాసే రచయితలు ఏడుస్తూ ఉండాలా'- నన్ను నే

నే ఓ మొట్టికాయ వేసుకుని నవ్వుకున్నాను. ఎప్పట్లాగే రచయిత్రులెవరూ కన్పించలేదు.

"అబ్బో! అతనా, అతన్దగ్గరెప్పుడూ ఓ డజను కథల స్టాకుంటుంది. అడగని వాళ్లదే పాపం. ఒకో కథని తీసి పంచిపెట్టేస్తాడు పత్రికలకి" అభినయించి చూపుతున్నాడొకాయన. చుట్టూ ఉన్న అందరూ పగలబడి నవ్వులు.

"అవునూ, తాతగారికింత పెద్దపర్సు ఎందుకిస్తున్నట్టు?"

"ఏముంది, టపాకట్టేసేలోపల ఉడతాభక్తిని చూపించుకోవాలని"

"సినిమాలకి కూడా రాసేడుకదా, ఏమీ గడించలేదంటావా?"

కాలేజీ కుర్రాళ్లు కాబోలు ప్రశ్నలు- సమాధానాలు వాళ్లే చెప్పేసుకుంటున్నారు.

సభ ప్రారంభానికి సూచనగా మైక్ టెస్టింగ్ జరుగుతోంది. బైట నిలబడిన వాళ్లంతా లోపలికెళ్తున్నారు. నేను మొదటి గుమ్మంలోంచి వెళ్లి వెనక వరసలో చివరి సీటు ఖాళీగా ఉంటే కూర్చున్నాను. అనుకోకుండా ఆ పక్క సీట్లో మురళి ఉన్నాడు. అతనొక అముద్రిత కవి. ఆ మధ్య ఒక సాహిత్య సభలో పరిచయమయ్యాడు. కవిత్వం మాటేమో కాని, గొప్ప కబుర్ల పోగు. పలకరించి, తన పక్కనున్న మరో ఇద్దరికి నన్ను పరిచయం చేసాడు. అంతవరకూ కబుర్లు చెప్పుకుంటున్న ఆ ఇద్దరూ క్యూరియస్‌గా చూసేరు నావైపు.

నేను వినమ్రంగా నవ్వి స్టేజివైపు దృష్టి మళ్లించేను. సన్మాన గ్రహీతను కార్యకర్తలిద్దరూ చెరోవైపు పట్టుకుని స్టేజి మీదికి ఎక్కిస్తున్నారు. ఆయన మరీ ఇంత వృద్ధుడని నాకు తెలీదు. ఈ వయసులో ఆయన్నెందుకంత ఇబ్బంది పెట్టడం, ఆ పర్సేదో పట్టుకెళ్లి ఆయన ఇంట్లో ఇచ్చేస్తే కాదూ!

ఎప్పట్లాగే మురళి సగం నావైపు ఒరిగిపోయి గలగలా మాట్లేదేస్తున్నాడు. మురళి పక్కనున్న వాళ్లలో ఒకాయన లేచి బైటికెళ్లొచ్చేడు. కమలాఫలం కొనుక్కొచ్చినట్టున్నాడు, ఒలిచి అందరికీ రెండు రెండు తొనలు ఇచ్చేడు.

నేను థేంక్స్ చెప్పి తినబోతూ ఉలిక్కిపడ్డాను. రెండు తొనలూ కనక్షను విడకుండా వెజీనా ఆకారంలో విప్పి ఉన్నాయి. నేను బిత్తరపోయి మురళి వైపు చూసేను. వాళ్లిద్దరూ చేతుల్లో అలాంటివే పట్టుకుని మురళికి కన్నుకొట్టి వెకిలిగా నవ్వుతున్నారు. అది వాళ్ల బిహేవియర్‌లోని లేకితనాన్ని వెల్లడి చేస్తున్నా నేను మాత్రం ఒకగొప్ప అవమాన భారంతో కుంగిపోయాను.

అవతల, తన రచనల్లో స్త్రీపాత్రల్ని అద్భుతంగా చిత్రించిన మహా రచయితకి సన్మానం జరుగుతోంది. ఇవతల నేను భరించలేని ఉక్రోషంతో, లజ్జతో ముక్కుపుటాలదురుతూండగా చివుక్కున లేచి బైటికొచ్చేసాను.

ఆ ఆవేశంతో ఎలా నడిచానో అయిదు నిమిషాల్లో గోదారి గట్టుమీదున్నాను. పశ్చిమాకాశంలో సూర్యబింబం అస్తమించిన స్థానంలో కుంకుమ ఒలకబోసినట్టుంది. గోదారి నీళ్ల రక్తాన్ని రంగరించుకుని ప్రవహిస్తున్నట్టున్నాయి. కొత్త బ్రిడ్జి మీద వెళ్తున్న ట్రెయిను నా మనసు మీదుగా నడుస్తున్న ఫీలింగ్.

అటుగా వెళ్తున్న రిక్షాని పిలిచి ఇంటికొచ్చి పడ్డాను. ఆ రోజు మొదలు సభలు- సమావేశాలు అన్నీ బందయ్యాయి.

*** *** ***

రుతువుకాని రుతువులో ఉన్నట్టుండి ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. ఫిలిప్ స్టీరియోసిస్టంలో లతా గొంతు నైనా బరసే... అంటూ గొప్ప విషాదాన్ని ఒలకబోస్తోంది.

ఎందుకో, నాకు తెలీకుండానే ఏడుపొస్తోంది. ఎన్నాళ్లుగానో చూచాయగా నేను గెస్ చేస్తున్న ఆ సందర్భం రానే వచ్చింది. ఆ సాయంకాలం హఠాత్తుగా ఇంటికొచ్చిన నా భర్త ఒక గొప్ప కన్విన్సింగ్ వాయిస్‌తో సంభాషణ మొదలుపెట్టేడు. చాలా తక్కువ మాటల్లో తను చెప్పదల్చుకున్నది చెప్పేసేడు.

అలా ఆమెతో నేనతన్ని షేర్ చేసుకోడానికి ఒప్పుకోకపోతే డైవోర్స్ ఇచ్చి వెళ్లిపోవచ్చన్నాడు.

"ఆలోచించుకుని రేపు చెప్పు" అన్న అతని మాట పూర్తికాకుండానే నేను లేచి నిలబడ్డాను. అతను చూస్తుండగానే పాపను తీసుకుని బైటికి వచ్చేసాను. నా పుట్టింటికి వెళ్లక తప్పని పరిస్థితి. వాళ్లకి భారం అయినా కాకపోయినా ఎల్లకాలం అక్కడుండడం నాకు నచ్చని విషయం.

పెళ్లికి ముందు పి.జి.లో క్లాస్ తెచ్చుకోవడం, నెట్ క్వాలిఫై కావడం నన్నా సమయంలో ఆదుకున్నాయి. సర్వీస్ కమీషన్ పోస్టింగ్స్ పడ్డాయి పేపర్లో. వాళ్లు పెట్టిన టెస్టు పాసై, ఇంటర్వ్యూలో సెలక్టయి కాలేజ్ లెక్చరర్‌గా ఈ ఊరొచ్చిపడ్డాను.

*** *** ***

థర్డవర్ లింగ్విస్టిక్స్ క్లాసు జరుగుతోంది. అటెండర్ రజియా వచ్చి చెప్పింది నా కోసం ఎవరో వస్తే కింద వెయిటింగ్ రూమ్‌లో కూర్చోబెట్టేనని.

లెక్చర్ పూర్తిచేసి కిందికెళ్లేను. నన్ను చూస్తూనే నవ్వుతూ లేచి నిల్చున్నాడతను. ఇతన్నెక్కడ చూసేనా అని త్వర త్వరగా ఆలోచనల పొరల్లోకి వెళ్లబోతూండగా "నేను మీకు తెలీదులెండి" అన్నాడతను.



పత్రికలో ప్రకటన చూసి మీ అన్నయ్యను కలిసేను. మీ ఫొటో కూడా చూసేను. ఆయన నన్నిక్కడికి పంపించేరు.

ఒక్కసారిగా నా గుండె వేగంగా కొట్టుకోవడం మొదలైంది. "జస్టెమినిట్" బైటికెళ్లి రెండు గ్లాసుల నీళ్లుతాగి, కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుని... ఏం చెయ్యాలో తోచక కాళ్లూ చేతులూ ఆడక... కాస్సేపు స్తబ్దంగా నిలబడిపోయి...

**"చూడండి, మీ పేరేంటో కూడా నేను అడగలేదు. అన్నయ్య పంపించేడన్నారని ఇంతసేపూ మీ ప్రశ్నలకి జవాబులు చెప్పేను. నేను మరో పెళ్లికి సిద్ధంగా లేనని మా అన్నయ్యతో చెప్పండి. పాపాయి అన్నం తిని నిద్రపోయే వేళ. దయచేసి మీరు వెళ్తే..." అన్నాను. అతనింకేదో మాట్లాడబోతే "ప్లీజ్" అన్నాను గుమ్మవైపు చూపిస్తూ.**

అన్నయ్య చేసే పనులన్నీ ఇలాగే ఉంటాయి. వద్దువద్దంటే వినకుండా పేపర్ ప్రకటన ఇచ్చాడు. ఇప్పుడీ ముక్కూ మొహం తెలీని వ్యక్తిని డైరెక్టుగా ఇక్కడికి పంపించేసేడు.

చివరికి ప్రిన్సిపాల్ రూమ్‌కెళ్లి పర్మిషన్ లెటరిచ్చి వచ్చాను. లీజర్‌లో ఉన్న స్టాఫంతా అప్పటికే చూసీచూడనట్టు చూస్తున్నారు. అతన్తో ఎక్కడ కూర్చుని మాట్లాడాలి? ఏం మాట్లాడాలి? ఇంత చిన్న ఊళ్లో ఎక్కడికని వెళ్లడం?

ఇంటికి తీసుకెళ్లడమే బెటర్. కాలేజ్ గేటు బైటికి రాగానే సిగరెట్ తీసి వెలిగించాడతను. తన ఎడ్యుకేషనల్ క్వాలిఫికేషన్స్ గురించి, చేస్తున్న టెంపరరీ జాబ్ గురించి మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

రోడ్డు మీది వాహనాల పొగకి సిగరెట్ పొగ తోడైంది. గాలి పీల్చుకోడానికి ఉక్కిరిబిక్కిరై కర్చీఫ్‌తో ముక్కపైన, పెదవిపైన పట్టిన చెమట తుడుచుకుంటున్నట్టు నటిస్తూ... ముక్కు మూసుకోలేని నాగరికత నటిస్తూ...

అతను మాట్లాడ్డం ఆపి పక్కకి తిరిగి నా వైపు ప్రశ్నార్థకంగా చూసేడు. ఒక్క నిముషం చేతిలోని సిగరెట్ వైపు చూసుకుని గొప్ప త్యాగం చేస్తున్న ఫోజుతో దాన్ని కాలికిందేసి నలిపేసాడు.

మధ్యాహ్న భోజనం వేళ కావస్తోంది. ఇంటికి తీసుకెళ్లాలా... హోటల్‌కా? అతిథి దేవోభవ... ఇంటికా... హోటల్‌కా... ఇంటికా.... హోటల్‌కా... ఆలోచన తెమిలేలోపు ఆ సెంటర్‌లో ఉన్న ఒకే ఒక్క భోజనం హోటల్ కేరళ అయ్యర్‌ది దాటిపోయేం.

కుక్కర్లో అన్నం ఉంది. పొద్దున్న చేసిన కూర, సాంబారు ఉన్నాయి. తింటానంటే ఓ ఆమ్లెట్ వేసేస్తే సరిపోతుంది.

ఇల్లుగలవాళ్ల మెయిన్ హాల్లోంచి పైకి దారి. ఇన్నాళ్లూ కలగని ఇబ్బంది ఈ రోజు, అందరి కళ్లూ మమ్మల్నే క్యూరియస్‌గా చూస్తున్నయో, చూస్తున్నట్టు నేననుకోవడమో...

తాళం తీసి గది బైట నీడగా ఉన్న చోట కుర్చీ వేసాను. డాబా పైన కుర్చీ ఉన్న చోట తప్ప మిగతా చోటంతా ఎర్రని ఎండ. కూజాలోని నీళ్లు గ్లాసులోకి వంపుకొని తెచ్చేలోపల అతను కుర్చీని ఎత్తి పట్టుకుని లోపలికి వస్తూ "ఇదేంటండీ, ఇదేం పనిష్మంటు నాకు ఈ ఎండలో" అంటున్నాడు.

"సారీ.."

టీ కలిపి అతనికో కప్పిచ్చి, నేనో కప్పు తెచ్చుకుని కూర్చున్నాను. ప్రశ్నించడం తన జన్మహక్కన్నట్టు అతనేవేవో ప్రశ్నలు వేస్తూనే ఉన్నాడు. చెప్పగలిగిన వాటికి సమాధానాలు చెప్తున్నాను. అప్పుడు గుర్తొచ్చింది నాకు, పాపాయికి హాఫ్‌డే ఈ రోజు. వచ్చే టైం కావస్తోంది. రాగానే 'ఏం చేసేవ్" అనడుగుతుంది. తనకి స్వీటు ఇష్టం.

చటుక్కున లేచి కాసిన్ని బియ్యం పెసరపప్పు కడిగి స్టవ్ మీద పెట్టేను. ఉదయం పచ్చడి చెయ్యగా మిగిలిన కొబ్బరిముక్కని ప్లేటులో పెట్టుకుని చాకుతో చిన్నగా తరుగుతూ కూర్చున్నాను.

"మీరేదో వంట ప్రయత్నంలో ఉన్నట్టున్నారు, కతికితే అతకదండోయ్" అంటున్నాడతను పెద్దగా నవ్వుతూ. అప్పుడన్పించింది నాకు, అతను కొంచెం ఓవర్‌టైప్ మనిషేమోనని. నాకు చికాకనిపించింది. అతను మాత్రం అతిచనువుగా మాట్లాడుతూనే ఉన్నాడు.

ఉడికిన పప్పుబియ్యంలో పంచదార, నెయ్యి, కొబ్బరి ముక్కలు వేసే వేళకి పాపాయి రానే వచ్చింది. "ఆ... నాకు తెల్సు. చెక్ర పొంగలి లెడీ" అంటోంది మెట్లు మీంచే.

గదిలో కొత్త వ్యక్తిని చూసి ఓ క్షణం గుమ్మంలోనే ఆగిపోయి, ఒక్క పరుగున తిన్నగా వంటింట్లోకొచ్చేసింది.

"పాపాయి మీతోనే ఉంటుందా, ఇంతసేపూ చెప్పలేదేం" అంటున్నాడతను వంటింటి గడపబైట నిలబడి, మొహం గంటుపెట్టుకుని. నేను సూటిగా అతని వైపు చూసి "ఏం, చెప్తే వెంటనే వెనక్కి వెళ్లిపోయేవారా" అన్నాను.

అతను కొంచెం తడబడి "అహహ... అదేం కాదు... అందేం కాదు... ముందుగా చెప్పలేదేం అన్నానంతే. పెద్దవాళ్లయితే ఇంకా జాగ్రత్తగా పెంచుతారు కదా. మీ అమ్మగారి దగ్గర వదిలెయ్యాల్సింది. పోనీలెండి. ఎలాగైనా నేనూ ఏదో ఒక పర్మినెంట్ జాబ్ దొరికేదాకా ఇక్కడుండాల్సినవాడినే కదా, పాప నాకు మాలిమౌతుందా అని అన్నానంతే...ఇలా రామ్మా పాపా! నేను నీ కొత్త నాన్నని" అన్నాడు.

ఆ మాటకి పాప నా వేపు షాక్ తిన్నట్టు చూసింది.

నేను అనీజీ ఫీలయ్యాను. వెంటనే "చూడండి, మీ పేరేంటో కూడా నేను అడగలేదు. అన్నయ్య పంపించేడన్నారని ఇంతసేపూ మీ ప్రశ్నలకి జవాబులు చెప్పేను. నేను మరో పెళ్లికి సిద్ధంగా లేనని మా అన్నయ్యతో చెప్పండి. పాపాయి అన్నం తిని నిద్రపోయే వేళ. దయచేసి మీరు వెళ్తే..." అన్నాను. అతనింకేదో మాట్లాడబోతే "ప్లీజ్" అన్నాను గుమ్మవైపు చూపిస్తూ. అతను మొహంనిండా అసహనం నింపుకొని కదిలేడు.

అతను బైటికెళ్లగానే పాపాయినెత్తుకుని గుండెకి హత్తు

కున్నాను. రేపు ఇది పెద్దదై నన్ను ప్రేమగా చూడకపోయినా సరే, తల్లిగా నా బాధ్యత మాత్రం నేను నిర్వహించి తీరతాను. మా ఇద్దరికీ మధ్యలో ఇంకెవ్వరికీ చోటు లేదు.

*** *** ***

ఊళ్లోని ఒక స్వచ్ఛంద సంస్థ వాళ్లు స్టూడెంట్స్‌కి ఎస్సే రైటింగ్ కాంపిటీషన్ పెట్టేరు. మార్కులు వేసి సెలెక్టు చెయ్యమని ఆ పేపర్స్ నాకు పంపించేరు.

లీజర్ టైంలో వెయిటింగ్ రూమ్‌లో మార్కులు వేసే పనిలో ఉండగా "మేడమ్, మా ఆవిడ ఊరెళ్లింది, ఓ పూట భోజనం పెడతారేంటి మీ ఇంట్లో" అన్నాడు మా ఇంగ్లీష్ లెక్చరర్. ఎవర్నో అనుకుని నేను పట్టించుకోలేదు.

నా పేరు పెట్టి పిలిచి మళ్లీ అదే మాటన్నాడు.

"అయ్యో, దానికేం భాగ్యం. అలాగే రండి" అన్నాను. ఉర్దూ లెక్చరర్ హసీనా నా చెయ్యిగిల్లి బైటికి తీసుకెళ్లింది.

"ఏయ్, నీకు మతుందా అసలు" అంది.

"ఏం?"

"వాడి మాటల్లో వ్యంగ్యం అర్థం చేసుకోనక్కర్లేదా?"

"వ్యంగ్యం ఏంటి?" అన్నాను నేను తెల్లబోయి.

"వాడి పెళ్లాం ఊరెళ్తే వండుకు తినలేడా. వండుకోలేకపోతే హోటల్లో మెక్కుతాడు. మొన్న నీ కోసం అతనెవరో వచ్చి వెళ్లినప్పట్నుంచీ స్టాఫ్‌లో కొందరు నువ్వు లేనప్పుడు నీ మీద అగ్లీ జోక్స్ వేస్తున్నారు. వాళ్లలో వీడొకడు" అంది.

మనుషులకిన్ని ముఖాలుంటాయా? భరించలేని తలపోటుగా అనిపించింది. మధ్యాహ్నాం లీవు పెట్టి ఇంటికొచ్చేసాను.

పోస్ట్ వచ్చినట్టుంది, గుమ్మం ముందు కవరు. ఉత్తరం పైన రైటింగ్ చూడగానే తలపోటు ఎగిరిపోయి, చెప్పలేనంత ఆనందంగా అన్పించింది. ఇక్కడి కొచ్చాకా మొదటి అన్‌ఫార్మల్ లెటరిది. నా బాల్య మిత్రురాలు సునీత రాసింది. పూర్వాశ్రమంలో మేమిద్దరం తరచుగా ఉత్తరాలు రాసుకొనే వాళ్లం.

ఈమధ్య ఊరొచ్చినప్పుడు మా ఇంటికెళ్లిందట. మా అమ్మ విశేషాలన్నీ చెప్పిందట. గుండ్రని ముత్యాలు పేర్చినట్టున్న అందమైన అక్షరాల్తో రెండు పేజీల ఉత్తరం నిండా భావుకత పొంగిపొర్లుతోంది.

ఆఖరి పేరాలో "మన జీవితం మన చేతుల్లోనే ఉందని మనం అనుకుంటాం. ఉండాలి కూడా. కాని, మన చుట్టూ ఉన్నవాళ్లు గొప్ప బాధ్యతతో మన శాంతి సుఖాల్ని హరించే ప్రయత్నం చేస్తూ ఉంటారు. లైఫీజ్ బ్యూటిఫుల్ పిక్చర్ చూసేవా? చూడకపోతే స్టార్ మూవీ ఛానల్‌లో వస్తుందేమో తప్పకుండా చూడు" అంటూ రాసింది.

పాపాయి చదువు పాడవుతుందని టి.వి. కొనలేదు. ఆ పిక్చర్లో ఏముందో తెలీదు కాని సునీత ఉత్తరంలోని ఆత్మీయత నాకు కొత్త ధైర్యాన్నిచ్చింది.

'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్'- ఎంత బావుందీ మాట!

లోపలికొచ్చి మంచం మీద వాలబోతూ రేడియో స్విచాన్ చేసాను. శిశిరమైన నేమి- వసంతమైన నేమి/ తమస్సులు- ఉషస్సులు/ తరలిపోవా...

మల్లాది సూరిబాబు గాత్రంలోని మార్దవానికి అనుకోకుండా కుడికంటి కొలుకులోకి ఓ నీటి చుక్క ఉబికి వచ్చింది. కొనగోటితో దాన్ని విదిలించి, సునీత ఉత్తరాన్ని మరోసారి విప్పేను. ●

## వెలుగు కిరణాలు

ఈ జీవితంలోని అన్ని ఆస్తుల కంటే ఖ్యాతి గొప్పది. ఈ శరీరం నశించినా నిలిచేది అదే.

\- షిల్లర్

ఆత్మీయురాలైన భార్యతో పోల్చదగ్గ వస్తువు ఈ ప్రపంచంలో మరొకటి లేదు.

\-వెబ్‌స్టర్

జ్ఞానాన్ని మించిన మహాశక్తి ప్రపంచంలో మరొకటిలేదు.

\- హాబ్స్



# అందం- ఆరోగ్యం- ఆనందం

ఆడా- మగ ఎవరైనా సరే, లైంగిక బంధుత్వాన్ని గౌరవించుకోవాల్సిందే. ఒకరు ఎక్కువా కాదు. ఒకరు తక్కువా కాదు. ఒకరు ఇచ్చేవారూ కాదు. ఒకరు పొందేవారూ కాదు. స్త్రీలు మాత్రమే ఇవ్వటమూ, పురుషులు మాత్రమే పొందటమూ అనేది అతి పురాతనమైన నమ్మకం. పొందు ఇద్దరికీ సంబంధించింది అనేది ఆధునికుల నమ్మకం.

లైంగిక బంధుత్వంలో ఇరువురి శరీరాలు- మనసులూ సంపూర్ణంగా ఐక్యం కావాలి. ఒక దశలో శరీరాల భాషే ప్రధానంగా పలుకుతుంది. శరీరాలు దగ్గరయ్యే ముందు మనసులు పూసులాడుకోవాలి. అప్పుడే నిజమైన సౌఖ్యానికి అర్థమేమిటో అనుభవంలోకొస్తుంది.

లైంగిక బంధుత్వంలో మనసు గురించి తర్వాత మాట్లాడుకుందాం. అంతకన్నా ముందు శరీరాల భాష గురించి తెల్సుకోవాలి. స్పర్శకి మించిన సమ్మోహన శక్తి ఇంకెక్కడా వుండదేమో!. ప్రియుడు ప్రియురాలిని తాకినప్పుడో, ప్రియురాలు ప్రియుడి శరీరాన్ని తాకినప్పుడో ఒక ప్రత్యేకమైన అనుభూతి జలజలా ప్రవహిస్తుంది. (ప్రేమకి సంబంధించిన పరిభాషలో భార్యాభర్తలు వుండరు. అంతా ప్రేయసీ ప్రియులే!)

దైనందిన జీవితంలో కుటుంబ సభ్యులో, స్నేహితులో మనల్ని అవసరంగానో, అసంకల్పితంగానో తాకుతుంటారు. కానీ ఆ స్పర్శలేవీ మన మనోలోకంలో చిరకాలం గుర్తుండవు. అన్నదమ్ములో, స్నేహితులో మన చేతుల్ని, చెంపల్ని, చుబుకాన్ని తాకితే అది సాధారణ వ్యాపకంగానే ఫీలవుతాం. కానీ ఏకాంతంలో ప్రియురాలు ప్రియుణ్ణి అదే భాగాలలో తాకితే కలిగే భావోద్రేకం వేరుగా వుంటుంది. అలాగే ప్రియురాలికి కూడా.

శరీరాలు నిజంగానే కలయికల్లో మాట్లాడుకుంటాయి. చేతులూ చేతులూ పెనవేసినప్పుడో, కళ్ళూ కళ్ళూ కల్సినప్పుడో, రెండు చేతులూ చెంపలపై ప్రేమమయంగా తాకినప్పుడో- చెప్పలేని అనుభూతుల పర్వం శరీరంలో తెరుచుకుంటుంది. అంతకు మించిన ఆనందం ప్రపంచంలో వేరెక్కడా లేదు. అందుకనే ఆధిపత్యంవల్ల కాకుండా ఇరువురూ సమభాగస్వామ్యంలో వర్ధిల్లే లైంగిక బంధుత్వం అన్ని బంధాలకన్నా అపురూపమైంది.

లైంగిక బంధుత్వంలో శరీరాల ప్రాధాన్యత అంత ప్రత్యేకమైంది కనుక- దేహ స్పృహ చాలా అవసరం. శరీరపు అందాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకొనే జాగ్రత్తలు తప్పక పాటించాలి.

అందమె ఆనందం అన్న మాటకి వున్న నిగూఢార్థం ఇది కూడా కావొచ్చు!

అంతర్గత సౌందర్యమే కాదు, బహిరంగ సౌందర్యం గురించీ స్త్రీ పురుషులిద్దరూ శ్రద్ధ పెట్టాలి. అన్నింటికంటే ముందు అవయవ సౌష్టవాన్ని పొందికగా వుంచుకోవడానికి, ఆకర్షణీయత పెంచుకోవడానికి తగు ప్రాధాన్యమివ్వాలి. ప్రతిరోజూ శరీరాన్ని కొత్తగా రూపొందించుకోవాలి. మితంగానైనా ఎక్సర్సయిజ్‌లు చేయాలి. ఆహారపు అలవాట్లలోనూ, తినే వేళల్లోనూ నియమాల్ని పాటించాలి. సౌందర్య పోషణ అనేది దైనందిన జీవితాన్ని, లైంగిక బంధుత్వాన్ని పూర్ణమయం చేయడానికే అన్న అవగాహన మర్చిపోకూడదు. అంతేకాదు- ఇది కేవలం స్త్రీలకే పరిమితమైన అంశం కాదు. పురుషులూ తప్పనిసరిగా పాటించాల్సిన అంశం.

శరీరాన్ని పొందిగ్గా పెట్టుకోవడమంటే మనసునీ, ఆలోచనల్ని కూడా పొందిగ్గా పెట్టుకోవడమే. అంటే స్థిరమైన స్పష్టమైన ధ్యానంలోకి- అదీ ప్రేమలోకంలోకినడవటమే. ఆధిపత్యాలు రద్దయ్యే ప్రపంచంలో మాత్రమే స్త్రీ పురుషులిద్దరూ పరిపూర్ణమైన మనుషుల్లా ప్రవర్తించగలుగుతారు.

\- రామన్